కార్చిచ్చు.. పచ్చదనానికి ముప్పు

- పల్లె ప్రకృతి వనాలు అగ్నికి ఆహుతి
- స్థలాభావం వల్ల అటవీ ప్రాంతానికి దగ్గరలో ఏర్పాటు
- మండల వ్యాప్తంగా 112 వనాలు



అగ్నిప్రమాదంలో దగ్ధమైన మర్రిగూడెం గ్రామపంచాయతీ పల్లె ప్రకృతివనం

ఇల్లెందురూరల్: పల్లెలు పచ్చందాలతో పరిఢవిల్లుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందిచాలనే లక్ష్యంతో ప్రభుత్వం హరితహారం పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రతి పల్లెలోనూ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. గ్రామాలలో స్థలాభావంతో చాలా వరకు పల్లె ప్రకృతివనాలను అడవికి సమీపంలో, ఆనుకొని, పంట చేల మధ్య నెలకొల్పారు. ఆయా ప్రకృతి వనాలు పచ్చదనంతో అల్లుకుపోయి ప్రజలకు అహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతున్నాయి. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. వనాలకు సమీపంలో ఉండటంతో ఇప్పటి వరకు చక్కటి అహ్లాదాన్ని అందించిన పల్లె ప్రకృతి వనాలకు అగ్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు భవిష్యత్ ప్రమాదాల నుంచి ప్రకృతి వనాలను రక్షించుకోవాల్సిన అవసరాన్ని చాటిచెపుతున్నాయి.

మండలంలో 112 ప్రకృతి వనాలు...

మండలంలోని ప్రతి గ్రామపంచాయతీకి ఒకటి చొప్పున పల్లెప్రకృతి వనాలను గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా, గ్రామపంచాయతీల తోడ్పాటుతో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఇవి సత్ఫలితాలనివ్వడంతో మండల వ్యాప్తంగా 112 పల్లె ప్రకృతి వనాలను విజయవంతంగా ఏర్పాటు చేశారు. అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఒక్కో ప్రకృతి వనాన్ని అర ఎకరం, ఎకరం విస్తీర్ణంలో నెలకొల్పారు. ఒక్కో వనం ఏర్పాటుకు నేల చదును, గుంతలు తవ్వడం, మొక్కలు నాటడం, సంరక్షణ, నీటిసదుపాయం వంటి పనులకు రూ.1.50 లక్షల వరకు వెచ్చించారు. ఇలా మండల వ్యాప్తంగా రూ.1.68 కోట్లు వెచ్చించారు. వీటితోపాటు మండల వ్యాప్తంగా ఒక్కొక్కటి రూ.18 లక్షల వ్యయంతో మూడు బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటి కోసం ఇప్పటివరకు ఒక్కో బృహత్ ప్రకృతి వనానికి రూ.పది లక్షలు చొప్పున ఖర్చు చేశారు. ఇంకా రెండు బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు చేయాల్సి ఉంది.

అడవులకు సమీపంలో.. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు ఏర్పాటు లక్ష్యం బాగానే ఉన్నప్పటికీ గ్రామాలలో స్థలం కొరత తీవ్రంగా నెలకొంది. దీంతో అటవీశాఖ సహాయంతో అడవికి సమీపంలో కొన్నింటికి, పంట చేలకు సమీపంలో మరికొన్నింటిని ఏర్పాటు చేశారు. ఈ సర్దుబాటే శాపంగా పరిణమించింది. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో అడవుల్లో కార్చిచ్చు రగులుతోంది. మరికొన్ని రోజుల్లో తునికాకు సేకరణలో భాగంగా మోడు కొట్టే కూలీలు అడవికి నిప్పు పెట్టడం ప్రతిఏటా జరుగుతుంది. అంతేకాకుండా పంట చేలలో చెత్తను తొలగించడం కంటే నిప్పు పెట్టి కాలబెట్టడానికే రైతులు మొగ్గుచూపుతున్నారు. దీంతో అడవికి, పంట చేలకు దగ్గరగా ఉండే పల్లెప్రకృతి వనాలకు అగ్నిప్రమాదాలు పొంచి ఉన్నాయి.

మర్రిగూడెంలో రెండు చోట్ల..

మర్రిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పల్లె ప్రకృతివనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ వనాలు అడవికి, పంట చేలకు మధ్యగా ఉండటంతో రెండు వైపుల నుంచి వ్యాపించిన మంటల్లో మొక్కలు పూర్తిగా కాలిపోయాయి. దీంతో ప్రభుత్వానికి రూ.3లక్షల మేర నష్టం వాటిల్లింది.

ముందస్తు చర్యలు అవసరం...

పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలను వేసవి ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు అటవీశాఖ తరహాలో రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ప్రకృతివనాల చుట్టూ పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం లేకుండా చూడటం, చిన్నపాటి కాలువ తవ్వి ఉంచడం వంటి కనీస చర్యలతో అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు మంటలు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అంతేకాకుండా అటవీశాఖ ద్వారా గ్రామపంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి మంటలను నియంత్రించే పనులపై అవగాహన కల్పిస్తే కొంతైనా అగ్నిప్రమాదాలను నిలువరించే అవకాశం ఉంటుంది.

రక్షణ చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వ భూములు లేకపోవడంతో అటవీశాఖ సహకారంతో అడవులకు సమీపంలో పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతోపాటు గ్రామపంచాయతీ నిధులను సైతం పెద్దమొత్తంలో ఖర్చు చేసి పల్లె ప్రకృతివనాలను పచ్చదనానికి నిలయంగా తీర్చిదిద్దాం. అగ్నిప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటాం. – మోకాళ్ల కృష్ణ, సర్పంచ్, మాణిక్యారం

అప్రమత్తం చేశాం



వేసవిలో అడవులలో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇవి అడవులకు సమీపంలో నెలకొల్పిన పల్లె ప్రకృతి వనాలకు వ్యాపించకుండా చర్యలు తీసుకునేలా గ్రామపంచాయతీ కార్యదర్శులను అప్రమత్తం చేశాం. మర్రిగూడెం గ్రామపంచాయతీలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదం మరో చోట జరగకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నాం. – అప్పారావు, ఎంపీడీఓ

మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్, చుంచుపల్లి ఎంపీపీ బాదావత్ శాంతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాలలో రాణించాలని, అందుకు కుటుంబ సభ్యులు, అధికారులు సహకరించాలని కోరారు. సమాజంలో మహిళలు ధైర్యసాహసాలతో విపత్తులను ఎదుర్కోవాలని, మహిళా సాధికారతకు కృషి చేయాలని, స్త్రీ ఒక వ్యక్తి కాదు.. శక్తి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్యాషన్ డిజైన్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పుష్పలత, ఏరియా సేవా అధ్యక్షురాలు వాణి జక్కం రమేష్, ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఫాతిమా రజాక్, రుద్రంపూర్ ఎంపీటీసీ ఆర్తీమక్కడ్ ఏరియా ఏజీఎం పర్సనల్ సామ్యుల్ సుధాకర్, సీనియర్ పీఓలు వజ్జ మురళీ, సుధాకర్, సేవా సెక్రటరీలు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు చట్టాలు..



మాట్లాడుతున్న సివిల్ జడ్జి దీప

కొత్తగూడెంఅర్బన్: మహిళాల రక్షణకు చట్టాలు ఎన్నో ఉన్నాయని కొత్తగూడెం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.దీప అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చట్టాలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో జడ్జి పాల్గొని మాట్లాడారు. చట్టాలు ఎన్ని ఉన్నప్పటికీ మహిళల పట్ల వివక్ష, నిత్యం ఏదో ఒకచోట అగాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలిసినా మగబిడ్డే కావాలని కోరుకోవడం వంటి ఆలోచన ధోరణి మారాలని పేర్కొన్నారు. బాలికలకు చిన్న వయస్సులో పెళ్లి చేయడం వలన వారు అనేక ఆరోగ్య సమస్యలకు ఎదుర్కొంటారని తెలిపారు. మహిళలకు అత్తింటి వేధింపులు, అదనపు కట్నం కోసం వేధిస్తే సెక్షన్ 498 ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని చెప్పారు. సెక్షన్ 125 సీఆర్‌సీ ప్రకారం భర్త నుంచి భార్య శాశ్వతంగా మనోవర్తి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.రాం ప్రసాదరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తంరావు, డిప్యూటీ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, మహిళా ప్రతినిధి గాదే సునంద, న్యాయవాదులు తోట మల్లేశ్వరరావు, మెండు రాజమల్లు, కాసాని రమేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జ్యోతి, విశ్వకర్మ, కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

12న ఇఫ్టూ జిల్లా మహాసభ



టేకులపల్లి: కేసీసీలో ప్రచారం చేస్తున్న నాయకులు

టేకులపల్లి: ఈనెల 12న పాల్వంచలో జరగనున్న ఇఫ్టూ జిల్లా ఏడో మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం టేకులపల్లి ఏరియా ప్రధాన కార్యదర్శి రాయండ్ల కోటిలింగం పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం కోయగూడెం ఓపెన్‌కాస్టులోని ఓబీ, కోల్ క్యాంపులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మేకల వినోద్‌కుమార్, పాయం రాజు, పాయం గోపాల్, చింత అనిల్, పగడయ్య, శంకర్, దేగటి లాలయ్య, పొట్టయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈనెల 12న పాల్వంచ పట్టణంలో నిర్వహించే ఇఫ్టూ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కు సారంగపాణి పిలుపునిచ్చారు. మొండితోగు గ్రామ పంచాయతీలో మహాసభల పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: ఈనెల 12న పాల్వంచలో జరగనున్న ఐఎఫ్‌టీయూ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు తోడేటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు ఆదేశించినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ ఒకటేనన్నారు. కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గౌని నాగేశ్వరరావు, భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరమల్ల మల్లయ్య, పవన్, వినోద్, రాజేశ్, యాదగిరి, లక్ష్మి, శాంతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

‘ధరణి’ సమస్యలు పరిష్కరించండి

టేకులపల్లి: ధరణిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ బాలాజీ నాయక్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ధరావత్ బాల కోరారు. ఈ మేరకు శుక్రవారం నాయకుల బృందం టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. తప్పుల తడకగా ధరణి ఉందని, తద్వారా అనేక మంది రైతులు తీవ్రంగా నష్టపోయారని, ధరణిలోని లోపాలను సవరించి నష్టపోయిన, మోసపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు నిరాటంకంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని, కేంద్రం తీసుకొచ్చిన ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ బృందం టేకులపల్లి ఎస్ఐ గన్‌రెడ్డి రమణారెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వాంకుడోత్ హత్తీరాం నాయక్, బాదావత్ సురేష్, బాణోతు రవి, తారాచంద్ పాల్గొన్నారు.

‘పది’లో మెరుగైన ఫలితాలు సాధిస్తాం



పదో తరగతి విద్యార్థులతో హెచ్‌ఎం బాలాజీ, ఉపాధ్యాయులు

జూలూరుపాడు: గతేడాది కంటే ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తామని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.బాలాజీ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పబ్లిక్ పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఎలాంటి మానసిక ఒత్తిడికి లోను కాకుండా మనోధైర్యంతో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించి, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. ప్రణాళికబద్ధంగా పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, దీనికి ఉపాధ్యాయుల సహాయ, సహకారాలు తీసుకోవాలన్నారు.

తొమ్మిదో తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, బి సంపత్, ఎస్ శ్రీనివాసరెడ్డి, కె శ్రీనివాసరావు, సత్యం, బాలు, మిర్యాల రమేష్, పీఈటీ లక్ష్మయ్య, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

కలెక్టరేట్‌లో పొంచి ఉన్న ప్రమాదం



కొత్త కలెక్టరేట్ సముదాయంలో మండే ఎండలోనే వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోంది. అసలే వేసవికాలం అక్కడక్కడా వాహనాలు దగ్ధమవుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. విధుల నిమిత్తం రోజూ కలెక్టరేట్‌కు వచ్చే ఉద్యోగుల బైక్‌లు, కార్లు ఎండలోనే నిలుపుతున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉండే అవకాశం ఉందని, అధికారులు వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా షెడ్డు నిర్మించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు. - చుంచుపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి : గన్యా, కలెక్టరేట్ ఏఓ
సెల్ నంబర్ : 9849906073

దివ్యాంగులకు కిట్లు పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వం దివ్యాంగులకు కల్పించే సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం కొత్తగూడెం రైటర్ బస్తీలోని భవిత కేంద్రంలో జరిగిన మానసిక దివ్యాంగుల కిట్స్ పంపిణీ కార్యక్రమంలో కోరం కనకయ్య మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు పలు సదుపాయాలను కల్పిస్తున్నాయని వాటిని ప్రతి దివ్యాంగ విద్యార్థి సద్వినియోగం చేసుకుని సమాజంలో అందరితో పాటు ఎదగాలన్నారు. దాని కోసం కృషి చేస్తున్న జిల్లాలోని సమ్మిళిత విద్యా రిసోర్స్ పర్సన్ల కృషిని, జిల్లా విద్యాశాఖను అభినందించారు. అనంతరం జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు 1,679 మంది ఉన్నారని, వీరందరి కోసం జిల్లా విద్యాశాఖ ప్రత్యేకంగా భవిత కేంద్రాలను నిర్వహిస్తూ, పాఠశాలకు రాలేని విద్యార్థుల కొరకు ప్రత్యేకంగా హోం బేస్‌డ్ ఎడ్యుకేషన్ కూడా అందిస్తుందని చెప్పారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ద్వారా పాఠశాలకి, భవిత కేంద్రాలకు వచ్చే దివ్యాంగులైన పిల్లలకు ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, రీడర్ అలవెన్స్, బాలికలకు స్టైఫండ్ వంటి సదుపాయాలకు దాదాపు రూ.20 లక్షలను త్వరలో విద్యార్థుల అకౌంట్లో జమ కానున్నట్లు చెప్పారు. మానసిక దివ్యాంగులకు నేషనల్ ఇనిస్ట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజేబులిటీ సంస్థ వారు మూడు రకాల కిట్స్‌ను 24 మంది మానసిక దివ్యాంగులకు పంపిణీ చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్‌కే సైదులు, నేషనల్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి ఎం.శ్యామ్, సమ్మిళిత విద్యా రిసోర్స్‌పర్సన్లు శ్రీరామ్, అరుణకుమారి, రవి, పద్మావతి, అంజలి, జానకి, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించడంలో విఫలం

జూలూరుపాడు: రైతుల సమస్యలు పరిష్కరించడంలో బీఆర్ఎస్ సర్కార్ విఫలమైందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేష్ విమర్శించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. రమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించి నాలుగేళ్లు గడిచినా అమలకు నోచుకోలేదన్నారు. బ్యాంకుల్లోని రైతుల అప్పులను అసలు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించాలన్నారు. ధరణి పోర్టల్‌లోని తప్పులను సవరించి రైతులందరికీ పట్టాలు ఇవ్వాలని కోరారు. వ్యవసాయ రంగానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, అతివృష్టి, అనావృష్టితో పంటలు నష్టపోతే నష్టపరిహారం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శారదకు అందజేశారు. కార్యక్రమంలో సిరిపురపు ప్రసాద్, భూక్యా శ్రీను, మోత్కూరి నాగేశ్వరరావు, సిరిపురపు పుల్లారావు, భూక్యా రమేష్, గోపాల్ రావు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి



కొత్తగూడెంఅర్బన్: నినాదాలు చేస్తున్న నాయకులు



ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: సావిత్రీబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝెర్రా కామేష్ అన్నారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే వర్ధంతిని శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పీడిత ప్రజలు ముఖ్యంగా మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం ఉద్యమకారిణి అని కొనియాడారు. కార్యక్రమంలో వంగా రవిశంకర్, చెనిగారపు నిరంజన్ కుమార్, గుడివాడ రాజేందర్, తటిపాముల హరికృష్ణ, సందేల సందీప్, గోవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధాయినీ సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతిని శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో జూలూరుపాడులో ఘనంగా నిర్వహించారు. దేవరకొండ కిరణ్, కంచపోగు నరసింహారావు, మోషే, గోలి ప్రవీణ్, కొంగల లలిత, కంచపోగు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే 126వ వర్ధంతి నిర్వహించారు. శుక్రవారం కళాశాల ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ బిందుశ్రీ మాట్లాడుతూ.. 19వ శతాబ్ధంలో సమసమాజ నిర్మాణం కోసం పూలే దంపతులు నిర్విరామ సేవ, కృషి, త్యాగం వెలకట్టలేనిదని వారి ఆదర్శాలు భావితరాలకు మార్గదర్శనం అని కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు శేఖర్, శారద, ఇంద్రాణి, పిచ్చయ్య, రమేష్, కిరణ్‌కుమార్, రాజు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాల్వంచ: నేడు 220 కేవీ సీతారాంపట్నం సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 8 – 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ సోనీ

జూలూరుపాడు: గుండ్లరేవు గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ బోడా కైకతో కలిసి జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ ప్రారంభించారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఆదేశాలతో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయి.

ఒకటో తేదీనే వేతనాలు చెల్లించాలి

టేకులపల్లి: ప్రతినెలా ఒకటో తేదీ నాడే ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నంది కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పదో తేదీ వచ్చినా ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఖాతాల్లో జీతాలు జమ కాకపోవడం ప్రభుత్వ అసమర్థతను చాటుతోందని విమర్శించారు. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో బిల్లులన్నింటినీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

పోడు పట్టాలు అందించాలి

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్ర వ్యాప్తంగా పేదల సాగులో ఉన్న ప్రతి ఎకరాకు పోడు పట్టా జారీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాలుగు లక్షల ఎకరాలకు పోడు పట్టాలు జారీ చేస్తామని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటంపై ఆయన స్పందించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12.46 లక్షల ఎకరాల పోడు భూమి పేదల చేతుల్లో ఉందన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

వాయిదా

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 12,13 తేదీలలో గోదావరి ఖనిలో జరగాల్సిన సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మహాసభలు వాయిదా వేస్తున్నామని ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13 డిప్యూటీ లేబర్ కమిషనర్ హైదరాబాద్‌లో సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల ప్రక్రియపై రిజిస్టర్ సంఘాలను ఆహ్వానించిన నేపథ్యంలో మహాసభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి తేదీలను త్వరలో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి కల్యాణ రథం ప్రారంభం



ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

పాల్వంచ: ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు పాల్వంచ శ్రీనివాసగిరి (గుట్ట)పై జరగనున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్త సమాజ మండలి అధ్యక్షులు ఆరుట్ల లక్ష్మణాచార్యులు, ప్రధాన కార్యదర్శి ధర్మపురి రాము అన్నారు. శుక్రవారం ఆలయ పాదాల మండపం వద్ద ప్రచార రథాన్ని పట్టణ ప్రముఖులు కొత్త వెంకటేశ్వర్లు, దంత వైద్యులు సునీల్‌కుమార్, జయపాల్‌రెడ్డి ప్రారంభించారు. మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కల్యాణ మహోత్సవంపై ప్రచారం చేయడం జరుగుతుందన్నారు. 18న స్వామి వారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, ఇక్కడికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన పూజారి తోలేటి నగేశ్ శర్మ, అర్చకులు ఫణిరాజ చార్యులు, డీకె.భద్రయ్య, కందుకూరి రామకృష్ణ, తాటికొండ శ్రీలత, బండి నారాయణ, వేమూరి వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, ఏటుకూరి నరేశ్, జిన్నె రమేశ్, బండి రాంజీ అంబేద్కర్, గడ్డం వెంకట సబ్బయ్య, చనుమోలు శ్రీనివాసరావు, మహిళా, సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

జూలూరుపాడు: ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు కృషి చేయాలని జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. గర్భిణీ, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపాలన్నారు. అదే విధంగా చిన్నారులు, గర్భిణులకు వ్యాక్సిన్ క్రమం తప్పకుండా వేయాలని సూచించారు. కేసీఆర్ కిట్స్ అప్‌డేషన్ సక్రమంగా చేయాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో ఫీవర్ సర్వే చేయాలని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు దాటిన ప్రతిఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించి, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎస్ రత్నకుమార్, యూడీసీ వెంకటేశ్వర్లు, హెచ్‌వీ రాధిక, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా నరసింహారావు



నియామక పత్రం అందుకుంటున్న నరసింహారావు

జూలూరుపాడు: బీఎస్పీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా వెంగన్నపాలెం గ్రామానికి చెందిన తంబర్ల నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం నరసింహారావు స్థానిక విలేకరులకు తెలిపారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడకం ప్రసాద్ దొర చేతులు మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నట్లు చెప్పారు. బీఎస్పీని బూత్‌స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

12న చలో హైదరాబాద్

సింగరేణి(కొత్తగూడెం): తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ సదస్సు ఈనెల 12న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుప తలపెట్టామని ఈ సదస్సును జయప్రదం చేయాలని జిల్లా ఉద్యమకారుల ఫోరం గౌరవ చైర్మన్ శ్రావణబోయిన నర్సయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఉద్యమ సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఉద్యమకారులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని, తమను ఆదుకోవాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ సదస్సులో ఉద్యమకారులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రేపు గురుకుల కళాశాల ప్రవేశ పరీక్ష

ఇల్లెందురూరల్: ఈ నెల 12న గురుకుల కళాశాల ప్రవేశ పరీక్షను సుదిమళ్ల గురుకుల కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అరుణకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష కొనసాగుతుందని, పది నిమిషాల ముందు విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్, క్యాలిక్యులేటర్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమని పేర్కొన్నారు. ఇప్పటి వరకు హాల్‌టికెట్ అందని విద్యార్థులు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.